సాక్షి అనకాపల్లి

బుధవారం। 12। మార్చి। 2025



గంగాదేవి గావు పండగ 8లో

మూడేళ్లకు ఒకసారి వచ్చే గంగాదేవి గావు పండగను కె.కోటపాడు మండలం గుల్లేపల్లి, జోగన్నపాలెం గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం పొడిగా ఉండే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు ఐదు రోజులు 36.5 నుంచి 37 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 22 నుంచి 23.8 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహర్
	బుధ	గురు
అనకాపల్లి	6.10	4.52
నర్సీపట్నం	6.13	4.50

నాలాగ ఎందరో..



నేను బాపట్ల ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. గత మూడు టెర్ముల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాలేదు. గత ప్రభుత్వ హయాంలో వసతి దీవెన, విద్యాదీవెన క్రమం తప్పకుండా విడుదల చేసేవారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు టెర్ముల నుంచి నిధులు మంజూరు కాలేదు. ప్రతి నెల హాస్టల్‌కు రూ.4,200 నుంచి 4,500 వరకు నా తల్లిదండ్రులు చెల్లిస్తున్నారు. ప్రతి ఆరుమాసాలకొక పర్యాయం రూ.20 వేల నుంచి 30 వేల వరకు సెమిస్టర్ ఫీజులు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వక పోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వసతి దీవెన, విద్యాదీవెన అందించి మాలాంటి ఎంతో మందికి అండగా నిలిచింది.

-బొడాల మేఘన, బీఎస్సీ అగ్రికల్చర్ సెకండియర్, అర్జునగిరి, చీడికాడ మండలం



భీమబోయినపాలెంలో మధ్యలోనే నిలిచిపోయిన మెడికల్ కళాశాల భవనాల నిర్మాణం



యువత భవిత అంధకారం

- ఉద్యోగాలు నాటకం.. భృతి బూటకం
- చెదిరిన కల.. ఫీజు రీయింబర్స్‌మెంట్
- ఇంటికో ఉద్యోగం.. లేదంటే నిరుద్యోగ భృతి అంటూ ఊదరగొట్టిన చంద్రబాబు
- 9 నెలలు దాటినా ఆ ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- ఎంఎస్ఎంఈలు రాకపోవడంతో చిన్న ఉద్యోగాలకూ దిక్కులేదు
- చంద్రబాబును నమ్మి మరోసారి దగాపడ్డ యువత

సాక్షి, అనకాపల్లి:

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు దాటింది. ఉద్యోగాలు నాటకం.. నిరుద్యోగ భృతి బూటకంగా మారింది. ఎన్నికలకు ముందు ఇంటికో ఉద్యోగం ఇస్తామని.. అధికారంలోకి వస్తే 20 లక్షల మందికి ఉద్యోగాలిస్తామని.. లేదంటే నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామంటూ ఊదరగొట్టారు. ఇప్పుడే కాదు.. గతంలో 2014–19 పాలనా కాలంలోనూ నాటి టీడీపీ ప్రభుత్వం ఇదే మాదిరిగా నిరుద్యోగులను మోసం చేసింది. అమలుగాని హామీలు ఇవ్వడం... ఆ తర్వాత మాట తప్పడం చంద్రబాబు సర్కార్‌కు అలవాటుగా మారింది. ఉన్నత చదువులు చదువుతున్న పేద విద్యార్థులపై (5 త్రైమాసికాలుగా) ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్ పెట్టి రాక్షసత్వానికి పాల్పడుతోంది. ఫీజులు కట్టకపోవడంతో కళాశాలల నుంచి విద్యార్థులను వెళ్లగొట్టడం, పరీక్షల సమయాల్లో హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం చేస్తున్నారు. జిల్లాలో 39 వేల మందికిపైగా పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్, పీజీ చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ) ఒక్కటీ ఏర్పాటు కాలేదు. జిల్లాలో 4,79,920 కుటుంబాల్లో దాదాపుగా 2 లక్షల 30 వేల మంది నిరుద్యోగులు ఉన్నట్లు అధికారుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సగటున ప్రతి నెలా నిరుద్యోగ భృతి కింద ప్రభుత్వం రూ.69 కోట్లు చెల్లించాల్సింది. 9 నెలల కూటమి పాలనలో రూ.621 కోట్లు నిరుద్యోగులకు బకాయిపడింది.



యువతకు పోరాటాలే ఇక శరణ్యం

గతం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నెలకొల్పిన పరిశ్రమలు

35 భారీ.. 300 చిన్న, మధ్యతరహా కంపెనీలు

పరిశ్రమల్లో కొత్తగా వచ్చిన ఉద్యోగాలు 14,114

రీయింబర్స్‌మెంట్ అందుకున్న విద్యార్థులు 39 వేలు

అందుకున్న ఫీజుల మొత్తం రూ.26.12 కోట్లు

ప్రస్తుతం

జిల్లాలో నిరుద్యోగుల సంఖ్య 2.30 లక్షలు

కొత్తగా వచ్చిన పరిశ్రమలు సున్నా

రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు 39 వేలు

గతంలో పారిశ్రామిక పరుగులు.. వెల్లువలా ఉద్యోగాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయాల్లో 6 వేల శాశ్వత ఉద్యోగాలు, 10 వేల వలంటీర్లు ఉద్యోగాలు కల్పించారు. వైద్యారోగ్య శాఖలో 10 వేల మందికి పైగా వైద్యులు, వైద్య సిబ్బంది, పారా మెడికల్ సిబ్బందిని నియమించారు. అంతేకాకుండా జిల్లాలో నైపుణ్యశిక్షణ కేంద్రాల్లో శిక్షణ కల్పించి 1360 మందికి ఉద్యోగాలు కల్పించారు. 2019–24 ఐదేళ్లలో జిల్లాలో 35 భారీ పరిశ్రమలు, 300కుపైగా ఎంఎస్ఎంఈ పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం కల్పించింది. 2019లో 6 కంపెనీలు, 2020 నుంచి 2023 వరకూ రూ.15,425 కోట్లతో 29 భారీ పరిశ్రమలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా 14,114 మందికి ఉద్యోగాలు కల్పించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక 9 నెలల కాలంలో కొత్త పరిశ్రమలు, కొత్త ఉద్యోగాల ఊసే లేదు. ఉన్న పరిశ్రమలు మూతపడే దుస్థితి నెలకొంది.

మెడికల్ కాలేజీ ప్రైవేట్ పరం

ప్రజారోగ్య రంగాన్ని బలోపేతం చేయాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.8 వేల కోట్లకు పైగా నిధులు వెచ్చించి 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేశారు. వీటిలో ఇప్పటికే 5 కళాశాలల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. మిగిలిన మెడికల్ కళాశాలలు సగానికి పైగా నిర్మాణపనులు పూర్తయ్యాయి. నిర్మాణం పూర్తి చేసుకొని ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం కావాల్సిన దశలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. అప్పటి నుంచి ఒక్క ఇటుక పని కూడా జరగలేదు. మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడానికి యత్నిస్తోంది. 1921లో విశాఖలో ఆంధ్రా మెడికల్ కాలేజీ ఏర్పాటైన వందేళ్ల తర్వాత ఇన్నాళ్లకు ఉమ్మడి విశాఖ జిల్లాకు రెండు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను వరంలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారు. వీటిలో పాడేరు మెడికల్ కళాశాల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పూర్తి కాగా.. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో సగానికిపైగా నిర్మాణం జరిగింది. ఈ దశలో వచ్చిన కూటమి ప్రభుత్వం రూ.500 కోట్లతో నిర్మిస్తున్న కళాశాలను ప్రైవేట్ చేతులకు అప్పగించే కుట్రలకు పాల్పడుతోంది. ఇది అందుబాటులోకి వస్తే ఏటా 150 ఎంబీబీఎస్ సీట్లలో విద్యార్థులకు ప్రవేశం లభించేది. తర్వాత పీజీ వైద్య కోర్సులు వచ్చేవి. తద్వారా పీజీ వైద్య విద్యార్థులు, వారికి వైద్య విద్య బోధించే ప్రొఫెసర్లు అందుబాటులోకి వచ్చేవారు. బోధన కోసం 500 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి వచ్చేది. కానీ ఇప్పుడది కలగా మిగిలింది.

యువత కోసం పోరు బాట

- నేడు విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన కలెక్టర్‌కు వినతిపత్రం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు





యువత పోరు కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముత్యాలనాయుడు

అనకాపల్లి: ఎన్నికల ముందు అలవి కాని హామీలు ఇచ్చి కూటమి నేతలు ప్రజలు నిలువునా ముంచేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు.. ఉద్యోగాలు రాక, నిరుద్యోగ భృతి ఇవ్వక యువత పడరాని పాట్లు పడుతున్నారని, వారి పక్షాన వైఎస్సార్‌సీపీ 'యువత పోరు' పేరిట నిరసన కార్యక్రమం చేపట్టిందన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో యువత పోరు పోస్టర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం 8 గంటలకు పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించాలని.. అనంతరం ఏడు నియోజకవర్గాల సమన్వయకర్తలు, పార్టీ శ్రేణులు అనకాపల్లి రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. అక్కడ నుంచి ర్యాలీగా కలెక్టరేట్ వరకు విద్యార్థుల తల్లిదండ్రులు, నిరుద్యోగులతో వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ ప్రజలను నిలువునా ముంచేశారని, సూపర్ సిక్స్ పథకాలని ఆశ కల్పించి అధికారం చేజిక్కించుకున్నాక నరకం చూపిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ మాట్లాడారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, కొంకోట మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు పల్లెల వెంకట సీతమ్మదొర, 80వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం.నాయుడు, జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మరిపల్లి శోభ, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ గణాంకాలివీ..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత ఏడాది జిల్లాలో వివిధ కేటగిరీలకు చెందిన 39,001 మంది విద్యార్థులకు రూ.26.12 కోట్లు రీయింబర్స్‌మెంట్ కింద విడుదల చేసింది. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం కనీస స్థాయిలో కూడా నిధులు విడుదల చేయలేదు.

కేటగిరీ	విద్యార్థులు	గత సంవత్సరం (2023-24)
ఎస్సీ	3078	రూ.1.96 కోట్లు
బీసీ	31,589	రూ.21.25 కోట్లు
ఈబీసీ	1372	రూ.1.08 కోట్లు
కాపు	2,962	రూ.1.83 కోట్లు

నిరుద్యోగులకు నిలువునా మోసం



నేను ఎంఏ., బీఈడీ పూర్తి చేశాను. కూటమి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంలో మాటలు, హామీలు తప్పితే అమలు చేయడం లేదు. ఉద్యోగం రాక, కుటుంబ పోషణ భారమై సతమతమవుతున్నాను. ఎన్నికల ముందు ఉద్యోగాలు ఇస్తామని, లేకుంటే నిరుద్యోగ భృతి కల్పిస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా నిరుద్యోగ భృతి మాటే లేదు. అధికారం కోసం ఉత్తుత్తి వాగ్దానాలు ఇచ్చారు. నిలువునా మోసపోయాం.

-లాలం అప్పలనాయుడు, జానకిరాంపురం, రోలుగుంట మండలం

ఇప్పుడైనా కళ్లు తెరవాలి



ఎన్నికల ముందు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామని వాగ్దానం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా ఇంతవరకు అతీగతీ లేదు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఏటా విద్యార్థులకు వసతి దీవెన, విద్యాదీవెన తదితర పథకాలు పక్కాగా అమలు జరిగేవి. దీంతో పిల్లలను చదివించడం సులువయ్యేది. ఇప్పుడు అప్పులు చేయాల్సివస్తోంది. యువత పోరు కార్యక్రమం ద్వారా అయినా విద్యార్థులకు మేలు జరుగుతుందని ఆశిస్తున్నాం.

-కాండ్రేగుల జగన్, విద్యార్థిని తండ్రి, తిమ్మరాజుపేట, మునగపాక మండలం

ప్రైవేటుపరం చేయటం తగదు



వైద్య విద్యను ప్రైవేటు పరం చేయటం తగదు. పేద విద్యార్థులకు వైద్య విద్య, పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ చొరవతో వైద్య కళాశాల మంజూరైంది. కూటమి ప్రభుత్వం పేదల ఆశలను అడియాసలు చేస్తూ కళాశాలలను ప్రైవేటు పరం చేయటం దారుణం. ప్రభుత్వమే వైద్య కళాశాలలను నిర్వహించాలి.

-బయపురెడ్డి గణమ్మ, నర్సీపట్నం

యువతకు భంగపాటు



విద్యార్థులతో పాటు నిరుద్యోగులను సైతం సీఎం చంద్రబాబునాయుడు మోసం చేశారు. ఇంతవరకు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు ఊసెత్తలేదు. విద్యార్థులు ఫీజులు కట్టలేక అనేక బాధలు పడుతున్నారు. ఉన్నత విద్య చదువుకొని ఉద్యోగాలు రాక చంద్రబాబు ఇచ్చే నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నాం. ఎప్పుడు ఇస్తారనేది స్పష్టత లేదు. చెప్పినదానికి చేసిన దానికి పొంతన లేదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి.

- వై.సందీప్, నిరుద్యోగి, చమ్మచింత గ్రామం, నాతవరం మండలం

కూటమి ఎమ్మెల్యేలకు ప్రజల్లోకి వెళ్లే ధైర్యంలేదు

- ఎన్నికల హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేదు
- భూములిచ్చిన రైతులను మోసం చేసిన ప్రభుత్వం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు
- నిర్వాసిత గ్రామాల్లో పర్యటన



నిర్వాసితుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

నక్కపల్లి: కూటమి ఎమ్మెల్యేలకు ప్రజల్లోకి వెళ్లే ధైర్యం లేదని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. ప్రజలు నిలదీస్తారనే భయంతో ప్రజల్లోకి వెళ్లకుండా తప్పించుకు తిరుగుతున్నారని మండిపడ్డారు. విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. మంగళవారం ఆయన మండలంలోని ఇండస్ట్రియల్ కారిడార్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా భూములు ఇచ్చిన నిర్వాసితులు, రైతులతో రాజయ్యపేట, చందనాడ, బుచ్చిరాజుపేట, అమలాపురం, డీఎల్ పురం తదితర గ్రామాల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లిస్తామని హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. డీఫారం భూముల్లో మామిడి, జీడి, కొబ్బరి తోటలకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. పరిహారం చెల్లింపుల్లో కూడా పక్షపాతం చూపిస్తున్నారన్నారు. జిరాయితీ రైతులతో సమానంగా నష్టపరిహారం చెల్లించాలని కోరితే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరితే ఇచ్చినంత తీసుకోండి, లేకపోతే మీ ఇష్టం వచ్చిన చోట చెప్పుకోండని హోం మంత్రి వ్యాఖ్యానించడం దారుణమన్నారు. రైతుల నుంచి రెండు పంటలు పండే భూములను కారుచౌకగా తీసుకుని కార్పొరేట్ శక్తులకు అధిక ధరలకు అమ్ముకుంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని మండిపడ్డారు. ప్రజలకు హాని కలిగించే బల్క్ డ్రగ్ పార్క్‌ను తీరప్రాంతాల్లో ఏర్పాటు చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకుందన్నారు. ఇచ్చిన హామీలపై ప్రజలు తిరుగుబాటు చేసే పరిస్థితి ఉందన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లోకనాథం, జిల్లా కార్యవర్గసభ్యులు అప్పలరాజు, మండల కన్వీనర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డి తిని బతకాలా..!

- ఉపాధి కూలీల వినూత్న నిరసన



గడ్డి చేత పట్టుకొని నిరసనకు దిగిన ఉపాధి కూలీలు

దేవరాపల్లి: ఉపాధి హామీ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి కూలీలు వినూత్న నిరసన చేపట్టారు. గడ్డి చేత పట్టి, నోట్లో పెట్టుకొని తమ ఆవేదన వెలిబుచ్చారు. గర్సింగ్, దొర్రి చెరువు, మారేపల్లి గ్రామాలలో చేసిన కూలి పనుల బిల్లులు చెల్లించకపోతే గడ్డి తిని బతకాలా అని ప్రశ్నించారు. ఎండు గడ్డి చేత పట్టుకొని మంగళవారం వినూత్న రీతిలో ఆందోళన చేపట్టారు. నాలుగు నుంచి ఎనిమిది వారాల వరకు ఉపాధి కూలీల సొమ్ము చెల్లించక పోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి ఆందోళనకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షుడు బి.టి.దొర మద్దతు పలికారు.

నేడు, రేపు జిల్లాలో రాష్ట్ర ఆహార కమిషన్ పర్యటన

తుమ్మపాల: ఈ నెల 12, 13 తేదీల్లో రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు జి.దేవి జిల్లాలో పర్యటించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి తెలిపారు. ముందుగా విశాఖపట్నం జిల్లాలో పర్యటించి అనకాపల్లి జిల్లాకు చేరుకుంటారన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, చౌకధరల దుకాణాలు, సరకులు పంపిణీ వాహనాలు, సంక్షేమ వసతి గృహాలు తనిఖీ చేస్తారని జేసీ తెలిపారు.

పనులు జరుగుతున్న రోడ్డుకు మళ్లీ శంకుస్థాపన! 8లో

కల్యాణ వైభోగమే..



కల్యాణం తిలకిస్తున్న భక్తజన సందోహం, (ఇన్‌సెట్) కల్యాణం అనంతరం శ్రీదేవీ, భూదేవీలతో వేంకటేశ్వర స్వామివారు



స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

- కనుల పండువగా ఉపమాక వెంకన్న వివాహ మహోత్సవం
- తెల్లవార్లూ తిలకించి పులకించిన భక్త జన సందోహం

నక్కపల్లి: కల్యాణకాంతులతో ఉపమాక కనువిందు చేసింది. కమనీయ శోభతో కళకళలాడింది. ఉత్తరాంధ్రలో ప్రఖ్యాతి గాంచిన ఉపమాకలో బ్రహ్మాండనాయకుని వార్షిక తిరు కల్యాణం సోమవారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. దేవదేవుని వివాహాన్ని తిలకించేందుకు భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు అత్యంత ఘనంగా నిర్వహించిన స్వామివారి కల్యాణ ఘట్టాన్ని భక్తులు తనివితీరా తిలకించి పులకించిపోయారు. పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం ఉపమాకకు చెందిన అర్చకస్వాములు, వేదపండితులు గొట్టుముక్కల వరప్రసాద్, సంకర్షనపల్లి కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ఈ కల్యాణ ఘట్టాన్ని నభూతో నభవిష్యత్ అన్నరీతిలో నిర్వహించారు. కల్యాణానికి ముందుగా ఉపమాకకు చెందిన సింహాద్రాచార్యుల ఇంటి వద్ద కన్యావరుణసంవాదాన్ని భక్తుల హర్షధ్వానాల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉభయ నాంచారులతో కూడిన స్వామివారిని పెద్ద రథంపై ఉంచి రథోత్సవం జరిపారు. అనంతరం కల్యాణతంతు ప్రారంభమయింది. రాజగోపురం పక్కన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక వద్ద కల్యాణమహోత్సవం నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, స్వామివారికి యజ్ఞోపవీత ధారణ, కంకణధారణ, జీలకర్ర బెల్లం, మంగళ సూత్రధారణ, తలంబ్రాలు వంటి ఘట్టాలను వివరిస్తూ కల్యాణాన్ని నిర్వహించారు. తిరుపతి నుంచి ప్రత్యేకంగా వచ్చిన అర్చకస్వాములు నాలుగు వేదాలను పఠించారు. స్వామివారి కల్యాణాన్ని నిర్వహించే విధానాన్ని 5 వేల సంవత్సరాల క్రితమే స్వామివారి భక్తురాలు ఆండాళ్లు వివరించిన తీరును తమిళంలో చదివి వినిపించారు. స్వామివారికి టీటీడీ తరఫున అధికారులు పట్టవస్త్రాలు సమర్పించారు. జిల్లా నలుమూలల నుంచే కాక, ఇతర జిల్లాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు కల్యాణం పూర్తయ్యేవరకు తెల్లవార్లు మేల్కొని ఉన్నారు. కల్యాణోత్సవంలో హోం మంత్రి అనిత కూడా పాల్గొనడంతో పోలీసు బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేశారు. నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో నక్కపల్లి, పాయకరావుపేట, అడ్డురోడ్డు సీఐలు కుమారస్వామి, అప్పన్న, రామకృష్ణల ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేశారు. తెల్లవార్లు జాతర జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తోడపెద్దులతో సంబరాలు నిర్వహించారు.

క్లుప్తంగా

సింహాద్రి ఎన్టీపీసీలో కలెక్టర్



ఎన్టీపీసీ సోలార్ విద్యుత్ ప్లాంట్‌లో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

పరవాడ: అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం సింహాద్రి ఎన్టీపీసీని సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా కంట్రోల్ రూమ్‌లోని మహిళా ఉద్యోగులతో కాసేపు ముచ్చటించారు. ప్లాంట్‌లోని మోడల్ రూం పనితీరును తెలుసుకున్నారు. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను సందర్శించారు. సందర్శనలో భాగంగా పవర్ ప్లాంటు కార్యకలాపాలు, ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. బొగ్గు రవాణా సేకరణ లింకేజీలు, షెడ్యూల్ ప్రక్రియపై చర్చలు జరిపారు. సమర్థవంతమైన ఇంధన ఉత్పత్తికి ఎన్టీపీసీ సింహాద్రి చేస్తున్న కృషిని కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ వెంట సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ, ప్లాంట్ హెచ్‌ఆర్ బి.బి.పాత్ర, సీనియర్ అధికారులు ఉన్నారు.

తాండవ గేట్ల మరమ్మతులు ప్రారంభం



తాండవ ప్రాజెక్టు ప్రధాన గేట్ల మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న ప్రాజెక్టు డీఈఈ అనురాధ, చైర్మన్ సత్యనారాయణ

నాతవరం : తాండవ ప్రాజెక్టు ప్రధాన గేట్ల మరమ్మతులతోపాటు కాలువల అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు ప్రాజెక్టు డీఈఈ అనురాధ చెప్పారు. ఆమె మంగళవారం తాండవ ప్రాజెక్టు ప్రధాన గేట్ల లీకేజీలకు మరమ్మతు పనులను ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. తాండవ ప్రాజెక్టు అభివృద్ధికి రూ.2 కోట్ల 10 లక్షలతో 18 పనులు చేపడుతున్నట్టు చెప్పారు. ప్రస్తుతం తాండవ కాలువలకు సంబంధించి మూడు పనులు జరుగుతున్నాయని, మిగతా పనులు త్వరలో చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. జేఈలు శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో చిన్నయ్యపాలెం యువకుడి ఆత్మహత్య

గొలుగొండ : మండలంలో చిన్నయ్యపాలెంకు చెందిన కొరుప్రోలు సురేష్(22) అనే యువకుడు మృతి చెందడంతో గ్రామంలో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అయ్యారు. విజయవాడలో రెండేళ్ల నుంచి ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్న సురేష్ ఇటీవల ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లు వల్ల అప్పుల పాలైనట్టు కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు. అప్పుల బాధ తట్టుకోలేక రెండు రోజుల క్రితం విజయవాడలో పురుగు మందు సేవించి మృతి చెందడంతో మంగళవారం సురేష్ మృతదేహాన్ని సొంత గ్రామం చిన్నయ్యపాలెం తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

పనులు జరుగుతున్న రోడ్డుకు మళ్లీ శంకుస్థాపన!



గతంలో డిప్యూటీ సీఎం హోదాలో బోడిగరువు, నేరెళ్లపూడి మట్టిరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న బూడి ముత్యాలనాయుడు(ఫైల్)



బోడిగరువు, నేరెళ్లపూడి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మాడుగుల ఎమ్మెల్యే తనయుడు అప్పలనాయుడు తదితరులు

- బోడిగరువు, నేరెళ్లపూడి రోడ్డుకు ఎమ్మెల్యే తనయుడు శంకుస్థాపన
- ఎమ్మెల్యే కుమారుడు అప్పలనాయుడు తీరుపై సర్వత్రా విమర్శలు
- అధికారులు, ప్రజాప్రతినిధులు లేకుండా ఏ హోదాలో చేశారని విస్మయం

దేవరాపల్లి : ఇప్పటికే పనులు జరుగుతున్నా రహదారిపై మరలా టీడీపీ నాయకులు శంకుస్థాపన చేయడం పలు విమర్శలకు దారి తీసింది. చింతలపూడి పంచాయితీ శివారు బోడిగరువు, నేరెళ్లపూడి గ్రామాలకు వెళ్లే రహదారిలో బీటీ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణ మూర్తి కుమారుడు బండారు అప్పలనాయుడు మంగళవారం శంకుస్థాపన చేయడం వివాదాస్పదమైంది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ లేకుండానే ఏ హోదాలో అతను రోడ్డుకు శంకుస్థాపన చేశారంటూ పలువురు విస్మయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులు, అధికారులు లేకుండా శంకుస్థాపన చేయడం ముమ్మాటికీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలకు సైతం సమాచారం ఇవ్వకుండా చేయడంపై దుమారం రేగింది. దీనిపై అధికారులు సైతం అసంతృప్తి వ్యక్తం చేశారు.

నాడు బూడి చొరవతో రూ.2 కోట్లతో మట్టిరోడ్డు నిర్మాణం

చింతలపూడి పంచాయతీ పరిధిలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న బోడిగరువు, నేరెళ్లపూడి గిరిజన గ్రామాలకు కనీసం కాలినడకన వెళ్లేందుకు కాలిబాట సైతం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. సుమారు 4కి.మీ మేర దూరంలో ఉన్న సమ్మెదకు చేరుకోవాలంటే కొండలు, గుట్టలు, గెడ్డలు, వాగులు దాటి ప్రాణాలకు తెగించి రాకపోకలు సాగిస్తూ నరకయాతన అనుభవించేవారు. 2023లో డిప్యూటీ సీఎం హోదాలో బూడి ముత్యాలనాయుడు 5 కి.మీ మేర కొండలు, గెడ్డలు, వాగులు దాటుకుంటూ ఆ రెండు గ్రామాలకు కాలినడకన చేరుకొని వారి కష్టాలను స్వయంగా చూశారు. సమ్మెద బ్రిడ్జి నుంచి బోడిగురువు మీదుగా నేరెళ్లపూడి వరకు రహదారి సౌకర్యం కల్పించేందుకు రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయించి, నిర్మాణ పనులు పూర్తి చేయించారు. ఆ తర్వాత బీటీ రోడ్డు నిర్మాణ పనులకు సైతం సంకల్పించారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పనులు కొనసాగించాల్సి ఉండగా మరలా శంకుస్థాపనల పేరిట ఇలా హడావుడి చేయడం పట్ల విమర్శలు వ్యక్తమయ్యాయి.

పెయ్యిల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి



చిరికివానిపాలెంలో లేగదూడల ప్రదర్శనను తిలకిస్తున్న రామ్మోహన్‌రావు, చంద్రశేఖర్



విజేత రైతుకు బహుమతులు అందిస్తున్న రామ్మోహన్‌రావు, చంద్రశేఖర్

- చిరికివానిపాలెం, చౌడువాడ గ్రామాల్లో లేగ దూడల ప్రదర్శన
- ఆరోగ్యకరమైన పెయ్యిలకు బహుమతులు

కె.కోటపాడు : పెయ్యిల పెంపకంలో జాగ్రత్తలను పాటించడం వల్ల పెయ్యిల్లో ఎదుగుదల, ఆరోగ్యంగా ఉంటాయని అనకాపల్లి జిల్లా పశుసంవర్ధకశాఖ పశు వైద్యాధికారి పి.రామ్మోహన్‌రావు, విశాఖపట్నం ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలో చిరికివానిపాలెం, చౌడువాడ గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. చిరికివానిపాలెంలో 43, చౌడువాడలో 35 పెయ్యిలను ఈ ప్రదర్శనకు రైతులు తీసుకువచ్చారు. మొదటి మూడు స్థానాలలో ఆరోగ్యకరమైన పెయ్యిలుగా ఎంపికైన వాటి యజమానులకు బహుమతులతో పాటు పోటీలకు పెయ్యిలను తీసుకువచ్చిన రైతులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా జిల్లా పశువైద్యాధికారి రామ్మోహన్‌రావు, డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పెయ్యిలకు పుట్టిన 10 రోజులకు ఒకసారి నట్టల నివారణ మందును వేయడంతో పాటు ప్రతి నెలకు ఒకసారి 6 నెలల పాటు నట్టల నివారణ మందును వేయాలని తెలిపారు. ఆవు, గేదెలు ఈనిన 60 రోజుల నుంచి 90 రోజులలోపు చూడికట్టే ఇంజక్షన్‌ను చేయించడం వల్ల చూడికట్టే శాతం మెరుగ్గా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు లవణ మిశ్రమం ప్యాకెట్‌లను ఉచితంగా అందించారు.

కార్యక్రమంలో కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్, సౌజన్య, కొరువాడ, చౌడువాడ పశువైద్యాధికారులు సిహెచ్.వై.నాయుడు, సింహాచలంనాయుడు, పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

చోడవరం సుగర్ ఫ్యాక్టరీ సమస్యలు పరిష్కరించాలి

- సీఎంకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

సాక్షి, అమరావతి: అనకాపల్లి జిల్లాలో చోడవరం సుగర్ ఫ్యాక్టరీ సమస్యలు పరిష్కరించి చెరకు రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం సీఎంకు రాసిన లేఖను శ్రీనివాసరావు మీడియాకు విడుదల చేశారు. ఈ సీజన్‌లో చోడవరం సహకార చక్కెర కర్మాగారంలో తరచూ చెరకు క్రషింగ్ ఆగిపోయిందన్నారు. రోజుల తరబడి ఫ్యాక్టరీ నడవక ఫ్యాక్టరీకి వచ్చిన చెరకు ఎండల్లో ఎండిపోతూ రికవరీ, టన్నేజ్ రాక రైతులు నష్టపోతున్నారన్నారు. ఫ్యాక్టరీకి తెచ్చిన లారీలు, ట్రాక్టర్లు, ఎడ్లబళ్లు వారం రోజుల వరకు అన్‌లోడు కాకపోవడం వలన వాహనాల అద్దెల భారం భరించలేక రోజుల తరబడి పశువులను ఫ్యాక్టరీ వద్ద ఉంచలేక రైతులు నలిగిపోతున్నారని అన్నారు. సీజన్ ప్రారంభం నుండి ఫ్యాక్టరీ సాంకేతిక లోపాలు, స్కిల్డ్ వర్కర్లు లేకపోవడం, కరెంటు అంతరాయాలు వంటి కారణాల వలన క్రషింగ్ సజావుగా జరగక చెరకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఫ్యాక్టరీ ఆధునీకరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని, రైతులను ఆదుకోవాలని శ్రీనివాసరావు కోరారు.

బైకులు, బంగారం దొంగ అరెస్టు

అనకాపల్లి : రామాపురం కాలనీ ఏలేరు కాలువ వద్ద సోమవారం పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు వాహనాలు తనిఖీ చేస్తుండగా రావికమతం మండలం, కొత్తకోట గ్రామం, శివాలయం వీధికి చెందిన మొగలుతుర్తి మణికంఠ అలియాస్ రంగ పోలీసులను చూసి పారిపోబోయాడు. అనుమానంతో అతన్ని పట్టుకుని విచారించగా అతని వద్ద నుంచి చోరీ సొత్తు రెండు బైకులు, బంగారం స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ ఎం.శ్రావణి చెప్పారు. పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం విలేకరులతో వివరాలు వెల్లడించారు. గత ఏడాది డిసెంబర్ 15న అనకాపల్లి మండలం పిసినికాడ పంచాయతీ శివారు సుబ్బారావు దాబా దగ్గర హైవే పక్కన పార్క్ చేసి ఉన్న కారుల్లో అద్దాలను పగులకొట్టి అందులో రెండు హ్యాండ్ బాగుల్లో ఉన్న రూ.40వేలు నగదు, ఒక జత బంగారు చెంప స్వరాలు, ఒక జత బంగారు చెవి దిద్దులు, ఒక బంగారు మండ గొలుసు, ఒక బంగారు చైన్, ఒక యాపిల్ ఐఫోన్ చోరీకి గురైనట్టు ఫిర్యాదు అందింది. పై వస్తువులను మొగలుతుర్తి మణికంఠ చోరీ చేసినట్టు అంగీకరించినట్టు డీఎస్పీ చెప్పారు. ఆ వ్యక్తి నుంచి రెండు బైక్‌లు, బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్టు డీఎస్పీ చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ టి.వి.విజయకుమార్, కానిస్టేబుల్స్ పి.కిషోర్‌కుమార్, టి.సంతోష్ కుమార్, శివాజీ పాల్గొన్నారు.



పట్టుబడ్డ నిందితుడు మణికంఠతో డీఎస్పీ శ్రావణి, పట్టణ సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్వరరావు

లిక్విడ్ గంజాయితో యువకుడి అరెస్ట్



యాసస్ ఆయిల్(గంజాయి లిక్విడ్)తో యువకుడిని పట్టుకున్న ఎస్ఐ లక్ష్మినారాయణ

కె.కోటపాడు : యాసస్ ఆయిల్(గంజాయి లిక్విడ్)ను తరలిస్తున్న యువకుడిని మంగళవారం ఎ.కోడూరు ఎస్ఐ లక్ష్మినారాయణ పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాలివి. ఆనందపురం కూడలి వద్ద సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సందర్భంలో అనుమానస్పదంగా సంచరిస్తున్న గుంటూరు జిల్లాకు చెందిన షేక్ మహ్మద్ జాకీర్ అనే వ్యక్తి బ్యాగ్‌ను తనిఖీ చేయగా 900 గ్రాముల యాసస్ ఆయిల్(గంజాయి లిక్విడ్)ను గుర్తించినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ గంజాయి లిక్విడ్‌ను ఏజెన్సీ ప్రాంతం నుంచి తీసుకువస్తున్నట్టు నిందితుడు అంగీకరించాడన్నారు. ఆనందపురం మీదుగా అనకాపల్లికి వెళ్లే ప్రయత్నంలో అతను పట్టుబడినట్టు తెలిపారు. పట్టుబడ్డ యాసస్ ఆయిల్ విలువ రూ.20వేలు ఉంటుందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు విధించినట్టు వివరించారు.

విశాఖ-బెంగళూరు స్పెషల్‌కు జోలర్‌పేట్‌లో హాల్ట్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–ఎస్ఎంవీ బెంగళూరు–విశాఖపట్నం మధ్య నడుస్తున్న వీక్లీ స్పెషల్ రైలుకు జోలర్‌పేట్‌లో అదనపు హాల్ట్ కల్పిస్తున్నట్టు సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం–ఎస్ఎంవీ బెంగళూరు(08549) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 16 నుంచి, తిరుగు ప్రయాణంలో బయల్దేరే ఎస్ఎంవీ బెంగళూరు–విశాఖపట్నం(08550) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు 17 నుంచి జోలర్‌పేట్‌లో హాల్ట్ కల్పించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

కె.కోటపాడు : పిండ్రంగి గ్రామానికి చెందిన బి.స్వామినాయుడు(38) విద్యుత్ షాక్‌కు గురై మంగళవారం సాయింత్రం మృతిచెందాడు. తన ఇంటి నిర్మాణ పనులకు మేస్త్రి వద్ద స్వామినాయుడు సహాయంగా ఉన్నాడు. ఇంటికి సమీపం గుండా ఉన్న హెడ్‌డీ విద్యుత్ లైన్ వైరు ప్రమాదవశాత్తూ స్వామినాయుడు ఎడమ చేతికి తగులడంతో షాక్‌కు గురయ్యాడు. స్థానికులు వెంటనే అతన్ని ఆటోలో కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించే ప్రయత్నం చేశారు. అయితే మార్గమధ్యంలోనే స్వామినాయుడు మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ పోషణ చేసే భర్త మరణించడంతో తను, పిల్లలు అనాథలుగా మారామని భార్య లక్ష్మి రోధించడం చూపరులను కలచివేసింది. ఘటనపై లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఎ.కోడూరు ఎస్ఐ లక్ష్మినారాయణ తెలిపారు. మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం పూర్తి చేసి బంధువులకు అప్పగిస్తామన్నారు.



మృతిచెందిన స్వామినాయుడు

దివ్యాంగ బాలలకు ఎన్టీపీసీ వితరణ



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్, సింహాద్రి ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ

పరవాడ: స్థానిక దివ్యాంగ బాలల శ్రేయస్సుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యాన్ని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అభినందించారు. దివ్యాంగ బాలల ఉపకరణాల వితరణకు ఎన్టీపీసీ రూ.12.99 లక్షలు మంజూరు చేసింది. ఈ సందర్భంగా దీపాంజలినగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, మాట్లాడారు. దివ్యాంగ బాలల విద్యాభివృద్ధి, అవసరమైన ఉపకరణాల పంపిణీకి ఎన్టీపీసీ సమకూర్చిన నిధులను సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. సమగ్ర శిక్ష పథక సంచాలకులు డాక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో 43 భవిత కేంద్రాలకు గతంలో ఎన్టీపీసీ యాజమాన్యం రూ.12 లక్షలతో ఉపకరణాలు అందజేశారని, తాజాగా అనకాపల్లి జిల్లాలోని 24 భవిత కేంద్రాలు, ఆరు సహిత విద్యా రిసోర్స్ రూములు, ఉపకరణాలకు రూ.12.99 లక్షలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ మాట్లాడుతూ సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్య, వైద్యం, బాలికా సాధికారిత, ఉపకార వేతనాలు వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. ఎన్టీపీసీ సమకూర్చిన ఉపకరణాలను మండలాల వారీగా ఆయా భవిత కేంద్రాల నిర్వాహకులకు కలెక్టర్ అందించారు. దివ్యాంగ బాలలు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయ అధికారి బి.శకుంతల, రిసోర్స్ పర్సన్‌లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సంస్థ అధికారులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో గంగాదేవి గావు పండగ



జోగన్నపాలెంలో పందిరికి అలంకరించిన నగదు, చీరలు

- పందిరికి అరటి, కొబ్బరి, నగదు తదితర వస్తువులను వేలాడదీసి మొక్కులు చెల్లించుకున్న భక్తులు



గుల్లేపల్లిలో గంగాదేవిని దర్శించుకున్నమాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు : గుల్లేపల్లి, జోగన్నపాలెం గ్రామాల్లో గంగాదేవి(గావు) పండగ పర్వదినాన్ని మంగళవారం ఆయా గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి మూడేళ్లకు ఒక మారు రెండు గ్రామాల ప్రజలు అమ్మవారి పండగను నిర్వహించడం ఆనవాయితీ. ఆలయ ప్రాంగణంలో నిర్మాణం చేపట్టిన పందిరికి భక్తుల మొక్కులలో భాగంగా కొబ్బరి, అరటి, ద్రాక్ష పండ్లతో పాటు, నగదు, చీరలను వేలాడదీశారు. ఆయా వస్తువులను భక్తులు పొందేందుకు సాయంత్రం దోపిడీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులకు లభించే వస్తువులను అమ్మవారి ప్రసాదంగా భావిస్తారు. రెండు గ్రామాల్లో మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు.

మాజీ డిప్యూటీ సీఎం బూడి ప్రత్యేక పూజలు

గుల్లేపల్లి గ్రామంలో గంగాదేవి గావు పండగ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొన్నారు. గంగాదేవికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆయనను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. అలాగే ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, సర్పంచ్ బండారు దేముళ్లు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

సరికొత్త హంగులతో వైఎస్సార్ స్టేడియం

విశాఖ స్పోర్ట్స్: ఐపీఎల్ ప్రస్తుత సీజన్‌కు విశాఖలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియం సిద్ధమవుతోంది. మరో సారి ఢిల్లీ క్యాపిటల్స్ సెకండ్ హోం గ్రౌండ్‌గా విశాఖ స్టేడియాన్ని ఎంచుకోవడమే కాకుండా తొలి మ్యాచ్‌ను ఇక్కడే ఆడి సీజన్‌కు శ్రీకారం చుట్టనుంది. 27,251 మంది అభిమానులు ప్రత్యక్షంగా మ్యాచ్‌ను వీక్షించే అవకాశం ఉన్న వైఎస్సార్ స్టేడియంలో డీసీ తొలి మ్యాచ్ లక్నో సూపర్ జెయింట్స్‌తో 24వ తేదీ రాత్రి ఏడున్నర గంటలకు ఆడనుంది. అలాగే ఈ నెల 30వ తేదీ ఆదివారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ మధ్యాహ్నం మూడున్నరకే ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌ల నిర్వహణకు వీలుగా స్టేడియంలో ఆధునిక హంగులు సమకూరుస్తున్నారు. ఆటగాళ్ల గ్రీన్‌రూమ్స్‌తో సహా డగౌట్స్‌ను ఆధునికీకరించారు. మ్యాచ్‌ల్లో డ్రెస్సింగ్ రూమ్‌కి చాలా ప్రాధాన్యం ఉన్నా.. టీ–20లో ఆటగాళ్లు కూర్చునేందుకు మైదానానికి ఇరువైపులా ఉండే డగౌట్స్ ప్రత్యేకతను సంతరించుకుంటాయి. డీసీ మేనేజ్‌మెంట్ సూచనల మేరకు ఏసీఏ ప్రత్యేక దృష్టి పెట్టి సాధారణ ప్రేక్షకులతో పాటు కార్పొరేట్‌కు పెద్దపీట వేసింది. అందుకు అనువుగా 34 వీఐపీ కార్పొరేట్ బాక్స్‌లతో పాటు రెండు టీమ్ బాక్స్‌లను ఆధునికీకరించింది. ఫైర్ ఫైటింగ్ ఎక్విప్‌మెంట్‌తో సహా నాలుగు లిఫ్ట్‌ల్లో ఒకేసారి 64 మంది వెళ్లే విధంగా తీర్చిదిద్దింది. దాదాపు రూ.40 కోట్ల వరకు వెచ్చించి స్టేడియంలో సౌకర్యవంతమైన సీటింగ్ ఏర్పాట్లతో పాటు అభిమానులకు బాత్‌రూమ్‌లను సైతం మూడింతలు పెంచి సౌకర్యాలు కల్పించింది. స్టేడియంలో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసి 14 ఏళ్లు దాటిపోవడంతో.. వాటి స్థానంలో రూ.9.5 కోట్లు వెచ్చించి ఆధునిక టెక్నాలజీతో పూర్తి నైట్ మ్యాచ్‌కు అనువుగా ఆధునికీకరించింది. పెవిలియన్ ఎండ్ సౌత్ బ్లాక్‌లో ఆటగాళ్ల రూమ్, డగౌట్‌కు పైన 1,640 మంది కూర్చునే కార్పొరేట్ బాక్స్‌లు అన్ని హంగులతో సిద్ధమయ్యాయి. ఆటగాళ్లకు దగ్గరగా ఉండే అప్పర్ వెస్ట్, జి, ఐ స్టాండ్స్‌లోనూ సిట్టింగ్ ఏర్పాట్లను మెరుగుపరిచారు. స్టేడియంలో మొత్తంగా కార్పొరేట్ బాక్స్‌లతో సహా 22 స్టాండ్స్ ఉన్నాయి. ఈ రెండు మ్యాచ్‌లకు టికెట్లను త్వరలోనే ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఆధునికీకరించిన ఆటగాళ్ల గ్రీన్‌రూమ్

చాపల్లో గంజాయి రవాణా

తాటిచెట్లపాలెం: చాపల్లో చుట్టి గంజాయిని రవాణా చేస్తుండగా విశాఖపట్నం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలివి.. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తన సిబ్బందితో కలిసి మంగళవారం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. 8వ నంబర్ ప్లాట్‌ఫాంపై పశ్చిమ బెంగాల్‌కు చెందిన మాన్‌సింగ్ ఘోష్, కృష్ణపాల్‌లను తనిఖీ చేయగా.. వారి వద్ద గంజాయి లభించింది. వారు ఎవరికీ అనుమానం రాకుండా ప్లాస్టిక్ చాపల్లో గంజాయిని కట్టలుగా కట్టి తీసుకువెళ్తున్నారు. ఒడిశాలోని పాడువా నుంచి ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాకు గంజాయిని రవాణా చేస్తుండగా దొరికిపోయారు.

వారి వద్ద నుంచి రూ.89,500 విలువైన 17.9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని.. ఇద్దరినీ జీఆర్పీ ఎస్ఐ అబ్దుల్ మారూఫ్‌కు అప్పగించారు. పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ధైన్యం.. జూలో మూగ జీవాల వైద్యం

- ఇటీవల పుట్టిన రెండు సింహం పిల్లలు మృతి
- వారాల తరబడి పోటీ పడి మరీ సెలవుల్లో వైద్యులు



ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో మూగ జీవాలకు వైద్యం ప్రశ్నార్థకంగా మారింది. వైద్యులు వారాల తరబడి పోటాపోటీగా సెలవులు పెట్టడం, విధులకు హాజరైన రోజుల్లో కూడా సరిగా వైద్య సేవలు అందించకపోవడంతో మూగ జీవాల ఆరోగ్యం అగమ్యగోచరంలో పడింది. ఇటీవల ఇక్కడ శివంగి(ఆడ సింహం)కి పుట్టిన రెండు పిల్లలు మృత్యువాత పడ్డాయి. జూ పార్కుల్లో సింహాలకు పిల్లలు పుట్టడం దేశంలో ఇదే మొదటిసారి. ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకోవాల్సిన జూ వైద్యులు నిర్లక్ష్యం కారణంగా.. పుట్టిన రెండు సింహం పిల్లల్లో ఒకటి రెండు రోజుల వయసులో, మరొకటి 12 రోజుల వయసులో ప్రాణాలు కోల్పోయాయి. ఏడాదిన్నర క్రితం ఇక్కడ జిరాఫీ పిల్ల తల్లి కడుపులోనే మరణించిన విషయం తెలిసిందే. ఇతర దేశాల నుంచి ఇక్కడకు తీసుకువచ్చిన పలు అరుదైన వన్యప్రాణులు సైతం సరైన వైద్యం అందకపోవంతో మృత్యువాత పడుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లాంగ్ లీవ్‌లో డాక్టర్ శ్రీనివాస్

జూ పార్కు ఏర్పాటైనప్పటి నుంచి పశు సంవర్ధక శాఖకు చెందిన డాక్టర్ శ్రీనివాస్ ఇక్కడి మూగజీవాలకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఆయన వ్యక్తిగత కారణాలతో రెండేళ్ల క్రితం లాంగ్(ఐదేళ్ల) లీవ్ పెట్టారు. అప్పటి నుంచి పరిస్థితులు దిగజారాయి. ప్రస్తుతం ఇక్కడ ముగ్గురు వైద్యులున్నారు. వారిలో నెల క్రితం నియమించిన పశు సంవర్ధక శాఖకు చెందిన ప్రభుత్వ వైద్యుడున్నారు. మిగిలిన ఇద్దరు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వారిలో ఒక యువ వైద్యుడు ఐదేళ్లుగా పనిచేస్తున్నారు. ఆయనకు హైదరాబాద్‌లో సొంతంగా వెటర్నరీ మందుల సంస్థ ఉంది. ఆ సంస్థ నుంచే గతంలో అవసరానికి మించి మందులు కొనుగోలు చేయించేవారని సమాచారం. సదరు వైద్యుడు నెలలో సగం రోజులు సిక్ లీవ్‌ల పేరిట జూ డ్యూటీకి ఎగనామం పెడుతున్నారు. మరో మహిళా వైద్యురాలు నాలుగు నెలల క్రితం జూలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో చేరారు. ఆమె గతంలో కొన్నాళ్లు ఇక్కడ వైద్యురాలిగా పనిచేశారు. ఇక్కడ మానేసిన తర్వాత జీవీఎంసీ మొబైల్ వెటర్నరీ క్లినిక్‌లో చేరారు. ప్రస్తుతం ఆమె రెండు ఉద్యోగాలు చేస్తున్నట్టు జూ సిబ్బంది చెప్తున్నారు. అక్కడో వారం.. ఇక్కడో వారం అన్నట్లుగా ఆమె సేవలందిస్తున్నట్లు తెలిసింది. వీరిద్దరు డ్యూటీకి వెళ్లిన రోజుల్లో కూడా వన్యప్రాణులను సరిగా పరిశీలించట్లేదని యానిమల్ కీపర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరి నిర్లక్ష్యం కారణంగానే గర్భం దాల్చిన సింహానికి సరైన వైద్యం, అవసరమైన మందులు అందక నీరసించిన పిల్లలు పుట్టాయన్న ఆరోపణలున్నాయి. వీరిద్దరు ఇటీవల నియమించిన ప్రభుత్వ వెటర్నరీ వైద్యుడికి కూడా సహకరించకుండా సెలవుల్లో గడుపుతున్నారని సమాచారం. ఇంత జరుగుతున్నా అటవీశాఖ సీఎఫ్, జూ ఉన్నతాధికారులు సర్దుబాటు చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

క్లుప్తంగా

వెంకన్న కల్యాణం.. కమనీయం



వెంకన్న కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లిటౌన్: పట్టణంలోని దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారి వార్షిక కల్యాణం కనుల పండుగగా జరిగింది. సోమవారం రాత్రి ఒంటి గంట వరకు జరిగిన కల్యాణాన్ని భక్తులు వీక్షించి తరించారు. ఆలయ ప్రధానార్చకులు పులకండం విజయ బాబు, గిరిబాబు, ప్రసాదు, రాజేష్ ఆధ్వర్యంలో పంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం లోక కళ్యాణార్థం ఈ కల్యాణం జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస రావు, ఈవో టి.రాజసులోచన, ధర్మకర్తలు గోలి మురళి, వేదుల సూర్యప్రభ, సిహెచ్. నర్సింగరావు, కొణతాల అరుణ, కొణతాల వాసు, సోమాదుల తులసి, జనసేన నాయకుడు బీమరశెట్టి రాంకి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గజ్జాలమ్మ ఉత్సవం

కశింకోట: మోసయ్యపేట శివారు గోకివానిపాలెంలో గజ్జాలమ్మవారి ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారికి భక్తులు చీరలు, రవికెలు, అరటి గెలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ డైరెక్టర్ ఉల్లింగల రమేష్, కూటమి నాయకులు నిమ్మదల సన్యాసి నాయుడు, దొడ్డి నాగేశ్వరరావు, కర్రి వెంకట సత్యనారాయణ, జెర్రిపోతుల నూకినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ముందుగా గుర్తిస్తే క్షయ నివారణ సాధ్యమే



క్షయ వ్యాధి నివారణ మార్గాల బ్రోచర్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అనకాపల్లి టౌన్: క్షయ వ్యాధిని ముందుగా గుర్తించి మందులు వాడితే నివారణ సాధ్యమేనని డాక్టర్ శ్రావణి తెలిపారు. స్థానిక అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. డాక్టర్ అయ్యప్ప రెడ్డి మాట్లాడుతూ రెండు వారాలకు మించిన దగ్గు, సాయంత్రం పూట జ్వరం, బరువు తగ్గిపోవడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే దగ్గరలో ఉన్న పీహెచ్‌సీకి వెళ్లి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.ముకుందరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.కుమార్, డాక్టర్ ఎం.ఎస్.వి.కె.బాలాజీ, డాక్టర్ ప్రియ, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 6,567 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,700	4,420
మొదటి రకం	3,670	4,120
రెండో రకం	3,280	3,800
మూడోరకం	3,050	3,270

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ : రాజా
పౌరుషం : సత్యనారాయణ స్క్రీన్-2 (ఉదయం, మ్యాట్నీ)
యాంటీరేష్ : సత్యనారాయణ స్క్రీన్-2 (1, 2 షోలు)
మజాకా : పర్తిసాయి
ఛావా : షిర్డీసాయి
కింగ్స్టన్ : వెంకటేశ్వర
తండేల్ : శ్రీసత్య
శబ్దం : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 61 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-23 యూనిట్లు, ఓ పాజిటివ్-30 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 356 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 323 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని ఫోన్ నంబర్ 08924-223595లో సంప్రదించవచ్చు.

నిరుద్యోగ భృతి ఊసే లేదు



దేవరాపల్లి : ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కూటమి సర్కార్ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలి. లేకుంటే నిరుద్యోగులందరికీ నెలకు రూ. 3వేలు నిరుద్యోగ భృతి అందించాలి. ఒక పక్క ఉద్యోగం లేక, మరో పక్క కనీసం నిరుద్యోగ భృతి అందించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారంలోకి వచ్చి సుమారు పది నెలలు కావస్తున్నా నిరుద్యోగ భృతి ఊసెత్తక పోవడం దారుణం. నిరుద్యోగ యువతని మోసగిస్తే ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదు.

– మండల సాయిలత, నిరుద్యోగి, సీతంపేట

ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక ఇబ్బందులు



కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఫీజుయింబర్స్‌మెంట్ లేక ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నికల ముందు చంద్రబాబు విద్యార్థుల ఫీజు రియింబర్స్‌మెంట్ ఇస్తానని హామీ ఇచ్చినా నేటికి ఇవ్వలేదు. దీని వలన కళాశాల యాజమాన్యం ఫీజులు తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందడం జరిగింది.

రాయపురెడ్డి చరణ్, ఇంటర్ సెకండ్ ఇయర్ (గొలుగొండ)

నిరుద్యోగ భృతిపై మాయమాటలే..



అధికారంలోకి రాకముందు సూపర్ సిక్స్ పథకాలు పేరుతో నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు అందజేస్తామని ఎన్నికల ముందు నమ్మబలికారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది మాసాలు కావస్తున్నా సరే యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, లేదా నెలకు రూ. 3వేలు నిరుద్యోగ భృతి అందజేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కానీ అమలు చేయలేదు. రాష్ట్రంలో నిరుద్యోగులను మోసం చేశారు. గతంలో కూడా అధికారంలోకి రాకముందు ఇలాగే నిరుద్యోగులకు టోపీ వేశారు.

–మైచర్ల కుమార్ స్వామి, డిగ్రీ నిరుద్యోగ విద్యార్థి, అర్జునగిరి (చీడికాడ)

సంపద కేంద్రాలు.. అలంకారప్రాయమేనా?

- 32 పంచాయతీలకు గానూ 25 కేంద్రాలు ఇప్పటికే సిద్ధం
- వాటి నిర్వహణను గాలికి వదిలేసిన అధికారులు
- నీరుగారుతున్న లక్ష్యం



గొలంగాం నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం

తుమ్మపాల: పల్లెల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. గ్రామాల పరిశుభ్రతతో పాటు చెత్తతో సంపద సృష్టించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ప్రతి పల్లెలోను ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో దాదాపు అన్ని చోట్ల నిర్మాణ పనులు పూర్తి చేసుకుని కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయి. వాటిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చే క్రమంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీటి గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. పూర్తి చేసిన వాటిలో ఒకటి, రెండు మాత్రమే నిర్వహణలో ఉన్నాయి. కొన్నిచోట్ల ఈ కేంద్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. మరికొన్ని చోట్ల కేంద్రంలో సగ భాగాన్ని మాత్రమే పేరుకు వినియోగిస్తున్నట్లు అధికారులు చూపిస్తున్నారు. కొన్ని ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరాయి.

- చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నుంచి ఒక్కో కేంద్రానికి దాదాపు రూ.20 లక్షలు వరకు ఖర్చు చేశారు. కేంద్ర ప్రభుత్వం బ్యాటరీ వాహనాలు, మేజర్ పంచాయతీలకు ట్రాక్టర్లు, జనాభా ఎక్కువగా ఉంటే అదనపు ట్రాక్టరు, గాజు సీసాలు పొడి చేయడానికి ప్రత్యేక యంత్రాలు సమకూర్చడంతో పాటు హరిత రాయబారులను నియమించింది. వీరికి కేంద్ర ప్రభుత్వమే జీతాలు చెల్లించింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం హరిత రాయబారులను క్లీన్ మిత్రలుగా పేరు మార్చింది. వీధుల్లో సేకరించిన తడి, పొడి చెత్తతో పాటు గాజు, పెంకు, ప్లాస్టిక్‌ను వేరు చేస్తారు. వాటిని వేర్వేరు తొట్టిలతో వేసి కుళ్లించి, వానపాములతో సేంద్రియ ఎరువు తయారు చేసి, రైతులకు కిలో రూ.4కు విక్రయించాలని నిర్ణయించారు. ఈ లక్ష్యం నీరుగారింది.

చెత్త తరలింపునకు వాహనాల కరువు

మండలంలో దాదాపు ప్రతి గ్రామంలోను సంపద కేంద్రాలు ఉన్నాయి. మండలంలో 32 పంచాయతీలకు 7 మినహా 25 వరకు కేంద్రాలు పూర్తయి సిద్ధంగా ఉన్నాయి. వాటిలో 14 కేంద్రాలు నిర్వహణ జరుగుతుందని అధికారులు చెబుతున్నప్పటికి క్షేత్ర స్థాయిలో కార్యరూపం దాల్చలేదు. మరో 11 కేంద్రాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ఈ గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు ఉన్నప్పటికి వాహనాలు లేక చెత్తను సంపద కేంద్రాలకు తరలించే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో సేకరించిన చెత్తను గ్రామ శివారు ప్రాంతాల్లో పోగుచేసి కాల్చివేస్తున్నారు. కొన్ని చోట్ల గోతుల్లో వేసి క్రషర్ బుగ్గితో కప్పేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పేరుకే చెత్త సేకరణ



చెత్త సేకరణ కేంద్రాలు పేరుకే నిర్మించినట్లుంది. మా గ్రామంలో చెత్త సేకరణ కేంద్రం ఉన్నప్పటికి నిరుపయోగంగానే ఉంది. వీధుల్లో చెత్తను సేకరించి రోడ్డు పక్కనే పడేస్తున్నారు. దీంతో దోమల వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నాం. చెత్త తరలించేందుకు పారిశుధ్య కార్మికులకు వాహనాలు సమకూర్చాలి.

– కోన లక్ష్మణ, సత్యనారాయణపురం



చెత్తను ఒక చోట పోగుపెట్టి కాల్చివేస్తున్న దృశ్యం



గొలగాం సంపద కేంద్రంలో తాగి పడేసిన ఖాళీ మద్యం బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు



రేబాకలో అసంపూర్తిగా నిలిచిపోయిన సంపద కేంద్రం

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రారంభం



ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

కశింకోట: మండలంలోని గ్రామాల్లో గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ మంగళవారం ప్రారంభమైంది. మొదటి రోజు ఐదు గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. తేగాడ, వెదురుపర్తి, అడ్డాం, బయ్యవరం, జమాదులపాలెం గ్రామాల్లో స్టేట్ రీసోర్స్ పర్సన్ నాగరాజు ఆధ్వర్యంలో జిల్లా రీసోర్స్ పర్సన్లు, విలేజి రీసోర్స్ పర్సన్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి పనులను పరిశీలించి ఇళ్లకు వెళ్లి అవి సక్రమంగా జరిగాయా? లేదా? అనే విషయమై ఆరా తీశారు. ప్రతి పంచాయతీలో నాలుగు రోజుల పాటు తనిఖీలు నిర్వహించి ఈ నెల 15 నుంచి పంచాయతీల వారీగా ప్రజాప్రతినిధుల సమక్షంలో గ్రామసభలు ఏర్పాటు చేసి, వాటిలో నివేదిక వివరాలను సిబ్బంది వివరించనున్నట్లు ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. ఈ నెల 23తో గ్రామ సభలు ముగుస్తాయని, 24న మండల స్థాయిలో కశింకోట మండల పరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ బహిరంగ వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు.

స్తంభాలు ఇలా.. రాకపోకలెలా?



శ్రీధర్ లాడ్జి నుంచి నరసింగరావుపేట వెళ్లే మార్గం మధ్య ఉన్న విద్యుత్ స్తంభం



చోడవరం బస్‌స్టాప్ వద్ద రోడ్ మధ్యలో ఉన్న స్తంభం

అనకాపల్లి టౌన్: పట్టణంలో పలు విద్యుత్ స్తంభాలు రోడ్ల మధ్యలో ఉండడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీధర్ లాడ్జి నుంచి నరసింగరావు పేటకు వెళ్లే మార్గంలోనూ, చోడవరం బస్టాప్‌నకు ఎదురుగా రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలున్నాయి. ఈ రహదారుల్లో నిత్యం వేలాది మంది ప్రయాణిస్తుంటారు. నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి చోడవరం, మాడుగుల, పాడేరు వెళ్లే బస్సులన్నీ చోడవరం బస్టాప్ వద్ద ఆగుతుంటాయి. పక్కనే ఆటో స్టాండ్ కూడా ఉంది. ఈ వాహనాలన్నీ రద్దీ సమయాలలో స్తంభానికి అవతల ఆపుతుంటారు. దాంతో ఆ రహదారిపై వెళ్లే వాహనదారులు, పాదచారులు రాకపోకలు నానా అవస్థలు పడుతున్నారు. ఇక నరసింగరావుపేట వీధిలో నారాయణ స్కూల్, కాలేజీ, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, నెట్, జెరాక్స్ సెంటర్లు ఉన్నాయి. ఈ రోడ్డు మధ్యలో కూడా స్తంభాలు ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా రోడ్డు మధ్యలో అడ్డంగా ఉన్న స్తంభాలను మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

'ప్రశాంత వాతావరణంలో గ్రామ దేవతల ఉత్సవాలు'



పోలపల్లి అమ్మవారిని దర్శించుకున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో గ్రామ దేవతల ఉత్సవాలను నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలో తుమ్మపాల పంచాయతీ కొత్తపేటవీధిలోని పోలిపల్లి అమ్మవారిజాతర సందర్భంగా మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అమ్మవారికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి స్టేజ్ ప్రొగ్రాంలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, పార్టీ సీనియర్ నాయకులు మలసాల కుమార్‌రాజా, పీడీ గాంధీ, పంచదార్ల కన్నారావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం చూపొద్దు



పన్ను వసూళ్ల గురించి మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు

యలమంచిలి రూరల్: ఆర్థిక సంవత్సరం ముగింపు సమయం దగ్గర పడుతుండడంతో పురపాలక సంఘం పరిధిలో బకాయిల వసూలుపై నిర్లక్ష్యం చూపవద్దని మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు ఆదేశించారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో పన్ను వసూళ్లపై ఆయన సమీక్ష జరిపారు. ఈ నెల 31వ తేదీలోగా వంద శాతం పన్ను వసూలయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ముఖ్యంగా 15వ ఆర్థిక సంఘం నిధుల మంజూరుకు అవసరమైన లక్ష్యం చేరుకోవాలని, ఇందు కోసం ఈ నెలాఖరులోగా రూ.47 లక్షల వరకు పన్ను వసూళ్లు చేయాల్సి ఉందని చెప్పారు. సచివాలయాల వారీగా ప్రభుత్వ, ప్రైవేటు భవనాల పన్ను ఎంత మేర వసూలు కావాల్సి ఉందో ఆయన సమీక్షించారు. గతేడాది పన్ను వసూళ్లలో తడబడడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాలేదని ఆయన చెప్పారు. దీని వల్ల మున్సిపాలిటీ భారీగా నష్టపోయిందని, ఈ సారైనా లక్ష్యం చేరుకోవాలని ఆయన సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.4.40 కోట్ల పన్ను వసూలు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.2.52 కోట్లు వసూలైంది. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి టి.విశ్వేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.సంతోష్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'మండల యూనిట్‌గా క్లస్టర్ కాంప్లెక్స్'

తుమ్మపాల: ఉపాధ్యాయులకు క్లస్టర్ కాంప్లెక్స్‌లో ప్రతి నెలా జరిగే వృత్త్యంతర శిక్షణకు మండల యూనిట్‌గా తీసుకోవాలని ఏపీపీటీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోయిన చిన్నారావు, చల్లా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం ఉన్న క్లస్టర్‌లో అత్యధికంగా మూడు హైస్కూళ్లు ఉండడం వల్ల ముగ్గురు ఉపాధ్యాయులు(స్కూల్ అసిస్టెంట్స్) మాత్రమే ఉంటున్నారని, అందువల్ల తమ అనుభవాలు పంచుకోవడానికి సరైన వాతావరణం ఉండడం లేదన్నారు. క్లస్టర్ కాంప్లెక్స్‌కు కనీసం ఒక మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకోవాలని కోరారు.

వివాదంలో గల భూమిపై ఆర్డీవో విచారణ



భూ సమస్య తెలుసుకుంటున్న ఆర్డీవో రమణ

రోలుగుంట : మండలంలో పనసలపాడు రెవెన్యూ పరిధిలో భూ సమస్యపై అందిన ఫిర్యాదుపై నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ స్పందించారు. తహసీల్దార్ నాగమ్మతో కలిసి మంగళవారం సాయంత్రం ఆ భూమి వద్దకు వెళ్లారు. ఈ రెవిన్యూలో 8/1,6/1,6/9 మూడు సర్వే నంబర్లకు చెందిన 12 ఎకరాలు ట్రైబల్ భూమిని నాన్‌ట్రైబల్‌కి విక్రయాలు చేసినట్టు హ్యూమన్ రైట్స్ కమిషనర్‌కు ఫిర్యాదు వెళ్లింది. దీని విచారణ బాధ్యతలను కమిషనర్ ఆర్డీవోకి అప్పగించడంతో ఆర్డీవో అక్కడకు వెళ్లి విచారణ జరిపారు. సర్వే రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సమస్యకు సంబంధించి విచారణ చేసి హ్యూమన్ రైట్స్ కమిషనర్‌కు నివేదిక అందిస్తామన్నారు.

పంటలో పురుగు నివారణకు చర్యలు

అనకాపల్లి: పిలకల పెట్టే దశలో ఉన్న పైరులో ఎకరాకు 35 కిలోల యూరియాను వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కలుపు మొక్కలున్నట్లైతే నాటిన 30 రోజులప్పుడు ఫినాక్స్‌ప్రాప్‌పి ఇథైల్ అనే కలుపు మందును ఎకరానికి 250 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి వేసుకోవాలన్నారు. వరిలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశం ఉన్నందున్న నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ, 8కేజీ ఎకరాకు 20 కేజీల ఇసుకలో కలిపి పొలమంతా సమానంగా చల్లుకోవాలన్నారు. వరిలో అగ్గితెగులు ఆశించే అవకాశం ఉన్నందున్న నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. 25–30 మధ్య ఉన్న మొక్కజొన్న పైరులో ఎకరాకు 52 కిలోల యూరియాను వేసుకోవాలని, ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున నీటి తడులు ఇవ్వాలని, మొక్కజొన్న పైరులో ప్రస్తుత వాతావరణ పరిస్థితుకు కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉన్నందున, నివారణకు 1500 పీపీఎం, వేప నూనె 5 మీ.లీ. లేదు క్లోరిఫైరిఫాస్ 2.5 మీ.లీ లేదా క్లోరంట్రానిలిప్రోల్ 0.3మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి ఉధృతిని తగ్గించవచ్చన్నారు.

సీహెచ్‌బీ అగ్రహారంలో ఉపాధి పనుల పరిశీలన



సీహెచ్‌బీ అగ్రహారంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి: మండలంలో సీహెచ్‌బీ అగ్రహారంలోని పెంద్యాల చెరువులో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం ఎంపీడీవో సీతారామరాజు పరిశీలించారు. చెరువులో పూడిక తీత, గట్టు పటిష్టం చేయడం వంటి పనులు చేపట్టారు. పనులకు వచ్చిన కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. రాని వారి పేరున మస్టర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పనికి తగిన వేతనం గిట్టుబాటు అయ్యే విధంగా పనులు కల్పించాలన్నారు. కూలీలకు వేసవి అలవెన్సు కూడా ఇస్తామన్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని పనులు జరిగే ప్రాంతాల్లో టెంట్లు, తాగునీరు సదుపాయం కల్పించాలని ఆయన సూచించారు. ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగితే సహించేది లేదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు పనులు జరిగే చోట అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఆయన కాగితలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించి కేంద్రాలకు తరలించి, వర్మీ కంపోస్టు తయారు చేయాలన్నారు.

29 లీటర్ల సారా స్వాధీనం



ఆయా గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న నాటు సారా

పాయకరావుపేట: మండలంలోని రాజవరం, శ్రీరాంపురం, పాయకరావుపేట గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తుల నుంచి 29 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. నిందితులను యలమంచిలి కోర్టుకు తీసుకెళ్లగా.. అక్కడి నుంచి రిమాండ్ నిమిత్తం యలమంచిలి సబ్ జైలుకు తరలించామన్నారు.

చూచుకొండ పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



పీహెచ్‌సీలో బాలింతతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవికుమార్

మునగపాక: మండలంలోని చూచుకొండ పీహెచ్‌సీని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) పి.రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ల్యాబ్‌తో పాటు మందుల పంపిణీ గదిని పరిశీలించారు. పీహెచ్‌సీలో డెలివరీ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలింతలకు వైద్యపరంగా అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించిన ఆయన పలు సూచనలు చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలన్నారు. సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సీజన్‌కు సంబంధించి తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్తేర్‌రాణి, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ గుర్రం శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ సువర్ణరాజు, హెల్త్ సూపర్‌వైజర్ బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

సంఘాల నిర్వహణ పక్కాగా ఉండాలి



మహిళా సంఘాలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీడీ డైజీ

మునగపాక: సంఘాల బలోపేతంతో ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చునని డీఆర్‌డీఏ ఏపీడీ డైజీ అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేటలో మంగళవారం మహిళా సంఘాలతో జరిగిన సమావేశమంలో డైజీ మాట్లాడారు. పీఎం మోదీ ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోలార్ విద్యుత్ వినియోగంపై దృష్టి సారించాలన్నారు. బ్యాంక్‌ల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. సంఘం లావాదేవీలు తేడాలేకుండా ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని చెప్పారు. అజెండా ప్రకారం సమావేశాలు నిర్వహిస్తూ ప్రగతి సాధించాలన్నారు. పుస్తక నిర్వహణ, ఆన్‌లైన్ చెల్లింపులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వెలుగు ఏపీఎం బాలరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్, బ్యాంక్ లింకేజ్ మేనేజర్ కుమారస్వామి, సీసీ రామకృష్ణ, విలేజ్ అసిస్టెంట్ శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.